క్లుప్తంగా

బోధనేతర యాప్‌ల బహిష్కరణ



రాజుపాలెం: ఫ్యాప్టో పిలుపు మేరకు బోధనేతర యాప్‌లను బహిష్కరిస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారి నరసింహారావుకు బోధనేతర యాప్‌లు బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల ఫ్యాప్టో నేత కొడవటి రవికుమార్, యూటీఎఫ్ బి.ఫణికుమార్, ఎస్టీయూ కె.పురుషోత్తం, ఉపాధ్యాయులు హేమకిరణ్, బాలాజీ నాయక్, సంపత్‌కుమార్, శ్రీనివాసరావు, తులసీరమణి, సురేఖవాణి, కుదీషియా, శ్రీదేవి, కె.శ్రీనివాసరావు, బాలశౌరి, బాబు, కె.శ్రీనివాసరావు, మిరీష తదితరులు పాల్గొన్నారు.

విప్పర్లలో 'ఉపాధి' ఈకేవైసీ నమోదు

విప్పర్ల(క్రోసూరు): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికుల ఈకేవైసీ నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని విప్పర్లలో నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయన తెలుపుతూ మండలంలో మొత్తం 8,798 యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నాయని, 15,034 మంది ఉపాధి శ్రామికులు ఉన్నారని తెలిపారు. గతేడాది పనికి వచ్చిన కుటుంబాలు 6,048కి 9,297మంది శ్రామికులు పని చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో ఈ రోజు వరకు 6,953 మందికి ఈకేవైసీ నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో డి.వెంకటేశ్వరరావు, టీఏలు పాల్గొన్నారు.

నూనె, ఉప్పు, చక్కెర వాడకం తగ్గించాలి



అచ్చంపేట: వైట్ పాయిజన్స్‌గా పిలిచే నూనె, ఉప్పు, చక్కెర వంటి పదార్థాల వాడకాలతో ఉబకాయం వస్తుందని, సాధ్యమైనంతవరకు వాటిని తగ్గించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పద్మ తెలిపారు. పోషక మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పెదపాలెంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ పిల్లలను పిజ్జాలు, బర్గర్లు, కురుకురేలు వంటి వాటికి దూరంగా ఉంచాలన్నారు. పోషక విలువలు ఉండే తాజా పండ్లు, పాలు, గుడ్లు, ఆకుకూరలు, ఉడికించిన శనగలు, బొబ్బర్లు, అలసందలు, పెసలు వంటివాటిని తినడం అలవాటు చేయాలన్నారు. వీటితో క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులనుంచి రక్షణ పొందవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న ప్రభుత్వ సేవలను గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు వినియోగించుకోవాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగర్ బాబు దీక్షకు మద్దతుగా ధర్నా

రొంపిచర్ల: దళిత యువకుడు సాగర్ బాబు చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా గురువారం ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోట నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. కోట నాయక్ మాట్లాడుతూ కారంపూడి మండలం పెదకొదమగుండ్ల గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు ఏఈ కోటేశ్వరరావు, ఎల్ఐ ఓంకార్, ఎల్ఎం వెంకటేశ్వర్లు, లైన్‌మెన్ పరబ్రహ్మాచారి, విద్యుత్ నిలుపుదల చేయకుండానే స్తంభం ఎక్కించి సాగర్‌బాబును వికలాంగుడిగా మార్చారన్నారు. దీనిపై తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన ఆ శాఖ అధికారులపై చర్యలు తీసుకుని, సాగర్ బాబుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, కేవీ ప్రసాద్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: ములకలూరు గ్రామ పరిధిలో ఆక్రమణలో ఉన్న వాగు పోరంబోకు భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్యమాదిగ, మాల మహానాడు నాయకుడు మద్దాల రమేష్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామంలో 4 ఎకరాల వాగు పోరంబోకు భూమిని కొంత కాలంగా మైనార్టీ వర్గానికి చెందిన భూస్వామి సాగు చేస్తున్నాడని, ఈ భూమిని నిరుపేదలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను వినతిపత్రం ద్వారా కోరగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు నిరుపేదలైన ఎస్సీలకు ఇస్తామని చెప్పి, మైనార్టీ వర్గానికి చెందిన భూస్వామికి వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. వాగు పోరంబోకు భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడల్లో ప్రతిభావంతులు

ఆటల్లో సత్తాచాటుతున్న విద్యార్థులు

సత్తెనపల్లి: క్రీడల్లో ప్రతిభ చూపుతున్నారు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు. దీనికి నిదర్శనం అండర్ 14, 17 పోటీల్లో సత్తా చాటుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొనే మండల క్రీడా జట్ల బాల, బాలికల ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్, ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్, ఎంపికలకు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఖోఖో 24 మంది, కబడ్డీ 20 మంది, వాలీబాల్ 20 మంది, బాల, బాలికల జట్లకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోయే సత్తెనపల్లి డివిజనల్ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొం టారని సత్తెనపల్లి డివిజన్ కోఆర్డినేటర్ బి.అనిల్‌దత్త నాయక్ తెలిపారు. పోటీలను నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాకరపర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మండల కోఆర్డి నేటర్ గండు సాంబశివరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కోణంకి కిరణ్‌కుమార్, సీహెచ్ శివగోవర్ధన్, రియాజ్, అచ్చిరెడ్డి, చిన్నయ్య, జి తులసిరామ్‌నాయక్, ప్రసన్న, రత్నాకర్, అనూష, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రోసూరులో..

క్రోసూరు: క్రోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జరుగుతున్న మండల స్థాయి పాఠశాలల ఆటల పోటీల్లో గురువారం అథ్లెటిక్స్ ఆటల పోటీలు నిర్వహించినట్లు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం డి.బాబూరావు తెలిపారు. అండర్ 17 విభాగం రన్నింగ్, బేస్‌బాల్, హైజంప్, లాంగ్‌జంప్ పోటీలు జరిగాయన్నారు. 200 మీటర్ల పరుగుపందెంలో ఎన్.ముఖేష్ జెడ్పీ పాఠశాల క్రోసూరు, ఎ.అఖిల్, జెడ్పీ దొడ్లేరు, డిస్క్‌త్రోలో ఆర్.తేజశ్రీ, జెడ్పీ పాఠశాల నాగవరం, లాంగ్‌జంప్‌లో షేక్ బషీర్ జెడ్పీ పాఠశాల బయ్యవరం నుంచి విజేతలుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రోసూరు: క్రోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి ఆటల పోటీల్లో అండర్ -14, 17లో క్రోసూరులోని జై భారత్ పబ్లిక్ విద్యార్థులు సత్తాచాటినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ టి.జైనేంద్రరెడ్డి గురువారం తెలిపారు. పోటీలు విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించి, భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగడానికి దోహదపడతాయన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను జైభారత్ స్కూల్ డైరెక్టర్ జైనేంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.



నందిగామలో ఎంపికైన బాల, బాలికల క్రీడా జట్లతో హెచ్‌ఎం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు



క్రోసూరు జెడ్పీ పాఠశాల ఆవరణలో విజేతలతో హెచ్‌ఎం బాబూరావు, పీడీలు



ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల కమిటీ సభ్యులు

ఆటల పోటీల్లో 'దమ్మాలపాడు' ప్రావీణ్యం

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు ఎస్‌జీ అండ్ ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు మాదలలో జరుగుతున్న అండర్-14, 17 మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచి నియోజకవర్గస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.సిద్దయ్య గురువారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆటల పోటీల్లో కబడ్డీ, చెస్ విభాగాల్లో ప్రతిభ కనబరిచారన్నారు. అండర్-14 కబడ్డీ విభాగంలో ఎం.గౌతమ్‌కుమార్, జి.భార్గవలక్ష్మీనారాయణ, జి.నిఖిల్, షేక్ ఇస్మాయిల్ లు ఎంపికయ్యారన్నారు. బాలికల జట్టులో డి.హిందూజ, కె.వాణి, వి.సింధు, బి.దివ్యశ్రీ ఎంపికయ్యారన్నారు. అండర్-17 కబడ్డీ బాలుర జట్టుకు ఎం.దిలీప్‌కుమార్, కె.షాలోం, సీహెచ్ నితిన్‌రెడ్డి, ఎస్.జగదీష్‌కుమార్ ఎంపికైనట్లు తెలిపారు. కబడ్డీ బాలికల జట్టులో పి.సాయిపూజిత, బి.దివ్యశ్రీ, ఎస్.నాగవర్ధిని, జి.లోకేశ్వరి, వై.కావ్య, కె.పల్లవి, సీహెచ్ హేమిమ, టి.హాసినిశ్రీలక్ష్మి, షేక్‌నాజ్నిసంజు ఎంపికయ్యారన్నారు. వీరంతా నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యాకమిటీ చైర్మన్ ఎస్.సతీష్, వైస్ చైర్మన్ సీహెచ్‌శాంతకుమారి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్.సాంబశివరావు, మాజీ చైర్మన్ పి.కోటేశ్వరరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు, పాఠశాల పీడీ ఎస్.సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు.

సత్తెనపల్లిలో రెండు చోరీలపై కేసుల నమోదు

సత్తెనపల్లి: పట్టణంలో జరిగిన రెండు చోరీలపై పట్టణ పోలీస్‌స్టేషన్ గురువారం కేసులు నమోదయ్యాయి. గుంటూరురోడ్‌లో ఉన్న ఆల్ కరీం బిర్యాని హోటల్లో గత నెల 24న గుర్తు తెలియని దుండగుడు తలుపు తాళం పగలగొట్టి గల్లా పెట్టెలో రూ.10 వేలు నగదు చోరీ జరిగింది. సీసీ పుటేజీలను పరిశీలించగా నాగార్జుననగర్‌కు చెందిన షేక్ సుభాని అనే యువకుడు దొంగిలించినట్లు గుర్తించి గురువారం పోలీసులకు ఆల్‌కరీం హోటల్ యజమాని కరీం మస్తాన్ ఫిర్యాదు చేశాడు. నందిగామ డొంక రోడ్ లోని లక్ష్మీ ఆక్వా ఫ్రెష్ వాటర్ ప్లాంట్ కు చెందిన గుండాల సులేమాను ఇంటికి తాళం వేసి వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాగా బీరువా తలుపులు తెరిచి మూడు జతల వెండిపట్టాలు, ఒక వెండి మొలతాడు, బ్యాంకు చెక్కు పుస్తకాలు కనిపించకపోవడంతో గురువారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు చోరీల ఫిర్యాదులపై ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేశారు. రెండు దొంగతనాలు నాగార్జున నగర్‌కు చెందిన షేక్ సుభాని చేసినట్లుగా భావించి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

దాచేపల్లి: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన జంగాల సుధాకర్ బాబు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాపారావు గురువారం తెలిపారు. ఇంట్లో జరిగిన చిన్నపాటి ఘర్షణ కారణంగా గురువారం తెల్లవారుజామున సుమారు 2.15 గంటల సమయంలో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాలేదని, తండ్రి బ్రహ్మయ్య బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదని తెలిపారు. దీంతో తండ్రి కుమారుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టమని ఎస్సై పాపారావు వెల్లడించారు.

సీజేఐపై దాడి యత్నం దారుణం

నకరికల్లు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కులనిర్మూలన పోరాటసమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ అన్నారు. సీజేఐ గవాయ్‌పై దాడికి యత్నించిన సీనియర్ లాయర్ రాకేష్ కిషోర్ దుశ్చర్యలను ఖండిస్తూ కులనిర్మూలనా పోరాటసమితి ఆధ్వర్యాన నకరికల్లులోని ఇందిరమ్మ కాలనీలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసు వాదనలు వింటున్న న్యాయమూర్తిపై బూటుతో దాడికి యత్నించడం దారుణమన్నారు. సంఘ్ పరివార్ ప్రోత్సాహంతో న్యాయమూర్తిపై దాడికి తెగబడ్డారని మండిపడ్డారు. న్యాయవాది కిషోర్‌పై కేసు నమోదు చేయాలని, ప్రధానమంత్రి మోదీ, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము లు న్యాయమూర్తికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు శిఖినం సాంబయ్య, జె.కృష్ణానాయక్, సుజాత, వర్లఝాన్సీ, దేపంగి శ్రీలక్ష్మి, మనీషా, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



కేఎన్‌పీఎస్ ఆధ్వర్యాన నకరికల్లులో నిరసన వ్యక్తం చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ తదితరులు

ఈ పంట నమోదు తప్పనిసరి

నకరికల్లు: ఈ పంట నమోదు చేసుకున్న రైతుల పంటలకే ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని నకరికల్లు, నర్సింగపాడు గ్రామాల్లో ఈ పంట నమోదుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. జియో ఫెన్సింగ్ దావా సూపర్‌చెక్ వెరిఫికేషన్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వరి, పత్తి, మొక్కజొన్న, కంది, మినుము, మిర్చి, పసుపు, కూరగాయలు తదితర పంటలు సుమారు 8,759 హెక్టార్లలో సాగులో ఉన్నాయన్నారు. ఇప్పటికే 6,287 హెక్టార్లలోని పంటకు ఈ పంటనమోదు పూర్తైందన్నారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ సహాయకుడి ద్వారా ఈ నెల 25 వరకు ఈ పంట నమోదు ప్రక్రియ సాగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ ముస్తఫా, వై.ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.



నర్సింగపాడులో ఈ పంట నమోదును పరిశీలిస్తున్న దృశ్యం

బాల్య వివాహాలు సామాజిక దురాచారం

సత్తెనపల్లి: బాల్యవివాహాలు సామాజిక దురాచారమని, వీటితో బాలల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధి, భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని అమరావతి సేవాసమితి అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు అన్నారు. అమరావతి సేవా సమితి ఆధ్వర్యాన పట్టణంలోని మాస్టిన్‌పేట, సుగాలికాలనీ హైస్కూల్లో విద్యార్థులకు, మహిళలకు బాల్య వివాహాలు, మానసిక ఆరోగ్యం, పౌష్టికాహార అంశాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ అందరూ బాల్యవివాహాలను అడ్డుకోవాలని, బాలలకు చట్టంలో సమానత్వం ఉందని గుర్తుంచుకోవాలన్నారు. రాజకీయంగా, సామాజికంగా చైతన్యం రావాలని, మహిళలు తక్కువ అనే అంచనా వేసుకోవద్దని, మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ మెహబున్నీసా, అంగన్‌వాడీ కార్యకర్తలు కిరణ్మయి, శాంతిబాయి, అరుణ, అంగన్‌వాడీ ఆయా రాణి, సమితి సభ్యులు షారోన్‌కుమార్, రాజ్‌కుమార్, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.



బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న వీరాంజనేయులు

ఆదమరిస్తే అంతే సంగతులు!



గండ్లూరు-భీమవరం రోడ్డులో కల్వర్టు కోతకు గురవడంతో ఏర్పడిన గుంత



నందిగామ-అమరావతి రోడ్డులో నందిగామ వద్ద చప్టాపై గుంతలు

సత్తెనపల్లి: అభివృద్ధే లక్ష్యం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కూటమి పాలకులకు క్షేత్రస్థాయిలో సమస్యలు కానరావడం లేదు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామంటూ సభలు, సమావేశాల్లో మైక్ దొరికితే చాలు చెవులు అదిరిపోయేలా ఉపన్యాసాలు ఇస్తున్నారు. దీనికి నిదర్శనం సత్తెనపల్లి-అమరావతి మార్గంలోని నందిగామ చప్టా. దీనిపై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులుగా మారాయి. గండ్లూరు-భీమవరం వెళ్లే రోడ్ సగభాగం కోతకు గురై భారీ గుంత పడి పాఠశాల బస్సులు, ఆటోలు, రైతులు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించాల్సి ఉంది.

పీ-4 సర్వే పారదర్శకంగా చేయాలి

ఉపాధి పీడీ సిద్ధ లింగమూర్తి

శావల్యాపురం: పీ-4 సర్వే పారదర్శకంగా చేయాలని జిల్లా ఉపాధి పీడీ సిద్ధ లింగమూర్తి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ-4 సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 1,632 కుటుంబాలను సర్వే చేయగా 778 కుటుంబాలను అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామ సచివాలయాల వారీగా జాబితాలను ప్రచురించామని, జాబితాలో పేర్లు లేని అర్హులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, నియోజకవర్గ ప్రత్యేకాధికారి వరద సుబ్బారావు, ఇన్‌ఛార్జ్ ఈవోపీఆర్‌డీ యాకోబు తదితరులు ఉన్నారు.

జీఎస్టీ సంస్కరణలను వినియోగించుకోవాలి

సత్తెనపల్లి: జీఎస్టీ సంస్కరణలతో పేదలపై భారం తగ్గిందని దీన్ని వినియోగించుకోవాలని పలువురు చెప్పారు. సత్తెనపల్లి ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో జీఎస్టీ సంస్కరణల పై గురువారం అవగాహన సదస్సు జరిగింది. సత్తెనపల్లి ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో ప్రజా వైద్య ఆరోగ్య పరిధిలో అవసరమైన మందులు తక్కువ ధరలకు లభిస్తాయని తెలిపారు. జీఎస్టీ తగ్గింపుతో ఆరోగ్య శాఖలో మందులు, మెడికల్ పరికరాలు, క్యాన్సర్ మందులు, హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ చౌకగా లభిస్తాయన్నారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీదేవి పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ప్రజలు, పాల్గొన్నారు.

పెదకూరపాడు: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై పెదకూరపాడు మండలంలోని 14 గ్రామ సచివాలయాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. 76త్యాళ్ళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జ్ డాక్టర్ పరిమళ తదితరులు మాట్లాడారు. పాటిబండ్ల సచివాలయం వద్ద టీడీపీ నేత పాటిబండ్ల యోహాన్ ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చడానికే..

అచ్చంపేట: పేదలకు నేరుగా లబ్ధి చేకూర్చడానికే జీఎస్టీ 2.0 విధానాన్ని తీసుకు వచ్చినట్లు మండల జీఎస్టీ నోడల్ అధికారి జి.సుధాకర్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం జరిగిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దీనికి సంబంధించి పోస్టర్స్ ఆవిష్కరించారు. నూతన జీఎస్టీ సంస్కరణలతో ప్రాణ రక్షక మందులు, అరుదైన వ్యాధులు, అవయవ మార్పిడి వంటి చికిత్సల్లో అందించే 36 రకాల మందులపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేసినట్లు నోడల్ అధికారి చెప్పారు. ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు, ఎంపీపీ భుక్యా స్వర్ణమ్మ, రమేష్‌నాయక్, సర్పంచ్ షేక్ జాని, మార్కెట్‌యార్డు డైరెక్టర్ అనుపకళ, వైద్యాధికారి సాయితేజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 ద్వారా ఆరోగ్యం విషయంలో ప్రతి పేద కుటుంబానికి చాలా మేలు జరిగిందని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ జాఫ్రిన్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్ ప్రదర్శన, అవగాహన కార్యక్రమం జరిగింది సత్తెనపల్లి కమర్షియల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రకాంత్, పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి శిఖాశాంసన్ ప్రసంగించారు. పీహెచ్‌సీ నుంచి అమరావతి బస్టాండ్ మీదుగా అందుకూరు రోడ్డు వరకు ర్యాలీ చేపట్టి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అంటూ నినాదాలు చేసారు. కార్యక్రమంలో నాకాంద్రు కాశయ్య, వెంకట్రామిరెడ్డి, దుద్దుల యోహాను, మెడికల్ షాపుల నిర్వాహకులు కటకం సీతారామ కోటేశ్వరరావు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బెల్లంకొండ: జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ ఇంచార్జ్ వైద్యాధికారి కే.అనూష తెలిపారు. గురువారం స్థానిక వైద్యశాలలో 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' కార్యక్రమం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మణి కుమారి, సూపర్‌వైజర్ బాషా, స్టాఫ్‌నర్స్‌లు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: ముప్పాళ్లలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై గురువారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో పి.రత్నం, వైద్యాధికారి పి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలోని అన్ని విలేజి హెల్త్ క్లీనిక్‌లలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీపై వైద్య సేవలపై, జీఎస్టీ తగ్గింపుపై డాక్టర్ వి.రవితేజనాయక్ , సత్తెనపల్లి కమర్షియల్ ట్యాక్స్ జీఎస్టీ నోడల్ అధికారి కె.గోపాలరావు, కమ్యూనిటీ హెల్త్ అధికారి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణరావు



సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్ పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది



75త్యాళ్ళూరులో అవగాన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉద్యాన పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

మాచవరం: ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని హెచ్‌వో ఎం.అంజలి భాయ్ తెలిపారు. మండలంలోని పిల్లుట్ల, మల్లవోలు గ్రామాలలో సూపర్ చెక్ కార్యక్రమంలో భాగంగా ఉద్యాన పంటలను పరిశీలించారు. పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరిగినప్పుడు ప్రభుత్వ సహాయం, ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఆమె తెలిపారు. అలాగే అధిక వర్షాల సమయంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. అరటి, బొప్పాయి తోటల్లో గాలికి చెట్లు పడిపోకుండా కర్రలతో ఊతం ఇవ్వాలన్నారు. అరటి, బొప్పాయి, మిరప, కూరగాయల తోటల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలు చేసుకుని నీటిని బయటకు పంపాలన్నారు. నీరు నిల్వ ఉండటం వలన వేరుకుళ్లు తెగులు రాకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మాంకోజెబ్ లేదా రిడొమిల్ మందు పిచికారీ చేసుకోవాలన్నారు. పొలాల్లో నీరు ఎక్కువ చేరడం వలన మొక్కలు భూమి నుంచి పోషకాలు తీసుకోక, ఆకులు పసుపు రంగుకి మారి మొక్కలు చనిపోయే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు హనుమంతు నాయక్, ప్రభాకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సభ్యుల సేవలు అభినందనీయం

శావల్యాపురం: రోటరీ క్లబ్ సభ్యుల సేవలు అభినందనీయమని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ అన్నారు. గురువారం మండలంలోని పోట్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా విద్యార్థులకు 30 జతల స్పోర్ట్స్ డ్రస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యాయులు, రోటరీ క్లబ్ సభ్యులైనా గాండ్ల నాగేంద్రుడు సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఆటలు పోటీల్లో పాల్గొని మండలానికి మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ఆలా శ్రీనివాసరావు, చిరుమామిళ్ళ కోటేశ్వరరావు, ముత్తినేని గిరిబాబు, కూచి రామాంజినేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు బత్తుల అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెడ్పీ స్థలం వేలాన్ని రద్దు చేయండి

జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి

బెల్లంకొండ: బెల్లంకొండలో జెడ్పీ స్థలం వేలంపాటను వెంటనే రద్దు చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల నాయకులతో కలసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. బెల్లంకొండలోని 363 సర్వే నంబర్లున్న తొమ్మిది సెంట్ల జెడ్పీ స్థలం బహిరంగ వేలంపై అధికారులు ఎటువంటి సమాచారం ప్రజలకు ఇవ్వకుండా, నిబంధనలకు విరుద్ధంగా గుట్టుగా పూర్తి చేశారని ఆరోపించారు. అధికారులు కేవలం నలుగురితో కలిసి స్థానిక టీడీపీ నాయకుడైన మస్తాన్‌షరీఫ్‌కు వేలంపాట లేకుండా సంవత్సరానికి రూ. 16,500 లకు అతి తక్కువ లీజుకు అప్రూవ్ చేస్తూ కాపీలను జిల్లా పరిషత్ కు అధికారులు పంపించినట్లు జెడ్పీటీసీ తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్, అధికారులు వెంటనే స్పందించి వేలాన్ని రద్దుచేసి తిరిగి వేలంపాట నిర్వహించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 524లో టీడీపీ నాయకులు అర ఎకరం భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకోవడంతో పాటు, మరో రెండు ఎకరాల భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. శ్మశాన స్థలంలో 45 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించి రేకుల షెడ్లు నిర్మించి అద్దెలు వసూలు చేస్తున్నారని తెలిపారు. టీడీపీ నాయకుల అక్రమాలపై న్యాయపరంగా పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో మండల వైస్ ఎంపీపీ బూదాటి మరియదాసు, కోఆప్షన్ మెంబర్ కావూరి షేక్ దరియా, మండల పార్టీ వైస్ కన్వీనర్ పాకాలపాటి మౌలాలి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గడిపర్తి చిన్నబాబు, నాయకులు నాగూర్ మీరా, సయ్యద్ అల్లా బక్షు, దాదు సాహెబ్, మహబూబ్ బాషా, ఖాజావలి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి, నాయకులు

నల్ల బర్లీ పొగాకు సాగు నిషేధం

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నల్ల బర్లీ పొగాకు సాగు నిషేధంపై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ బి.నిర్మల అధ్యక్షత వహించగా ఏవో శివలలిత మాట్లాడుతూ నల్ల బర్లీ పొగాకును రైతులు సాగు చేయవద్దన్నారు. ప్రత్యామ్నాయంగా కంది, జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేసుకోవాలన్నారు. తెల్ల బర్లీ పొగాకు సాగు కూడా కొనుగోలు కంపెనీల నుంచి అగ్రిమెంట్‌లు తీసుకుని సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రసాద్ నాయక్ పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కిశోర్‌కుమార్, ఆయా గ్రామాల వీపీఏలు పాల్గొన్నారు.